సాక్షి అనంతపురం

మంగళవారం । 21 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.9°/ 17.6°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం పెరిగింది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు



గుంతకల్లు: అయ్యప్ప మాలధారుల కోసం అనంతపురం జిల్లా మీదుగా కేరళలోని శబరిమలకు సికింద్రాబాద్‌-కొల్లాం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు ప్రతి శుక్రవారం సికింద్రాబాద్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు రైలు (07127) బయలుదేరి శనివారం రాత్రి 7.30 గంటలకు కొల్లం చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి ఈ రైలు (07128) కొల్లం జంక్షన్ నుంచి శనివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుందని తెలిపారు. ఫస్ట్ క్లాస్ ఏసీ, టూటైర్ ఏసీ, త్రీటైర్ ఏసీ, స్లీపర్‌తోపాటు సెకండ్ క్లాస్ జనరల్ బోగీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అయ్యప్ప స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొండచిలువను చంపిన గ్రామస్తులు



కొండచిలువ, కుందేలు కళేబరాలు

పుట్లూరు: గ్రామస్తుల చేతిలో కొండచిలువ హతమైంది. గరుగుచింతలపల్లి సమీపంలో సోమవారం ఏడు అడుగుల పొడవున్న కొండచిలువ గ్రామస్తులకు కనిపించింది. అప్పటికే కుందేలును చంపి మింగుతోంది. ఇది గ్రామంలోకి ప్రవేశిస్తే ప్రమాదమని భావించిన గ్రామస్తులు కొండ చిలువను కొట్టి చంపేశారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ పీడీ తరుణ్

తాడిపత్రి టౌన్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నేషనల్ హైవే పీడీ తరుణ్ కాంట్రాక్టర్లకు సూచించారు. తాడిపత్రి పట్టణ సమీపంలోని కడప రోడ్డులో జరుగుతున్న నేషనల్ హైవే 544డీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి నాణ్యమైన మట్టి ఉపయోగించాలన్నారు. మట్టి రోడ్డు రోలింగ్ పనులు ప్రతి లేయర్ పటిష్టంగా ఉండేలా చూడాలన్నారు.

అక్కనపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

అక్కనపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు ఆలూరు రామేశ్వరరెడ్డి, ప్రతాప్, సూర్యముని ఎన్‌హెచ్ పీడీని కోరారు. నేషనల్ హైవే కారణంగా గ్రామానికి వెళ్లాల్సిన రహదారిని కోల్పోతున్నామని, దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. హైవే మీదుగా గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరారు. ఇందుకు పీడీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మెగా ఇంజినీరింగ్ సంస్థ జీఎం రవిశంకర్ పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓల నియామకం



శ్రీనివాసరావు



శ్రీదేవి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ అనంతపురం డివిజన్, గుత్తి డివిజన్లకు కొత్త ఉప విద్యాశాఖ అధికారుల (డిప్యూటీ డీఈఓ)ను నియమించారు. అనంతపురం డివిజన్ డీవైఈఓగా విడపనకల్లు ఎంఈఓ-1 బి.శ్రీనివాసరావు, గుత్తి డివిజన్ డీవైఈఓగా పెద్దపప్పూరు ఎంఈఓ-1 హెచ్.శ్రీదేవిని నియమిస్తూ విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అనంతపురం డీవైఈఓగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ఎంఈఓ-1 వి.పద్మప్రియ, గుత్తి డీవైఈఓగా నంద్యాల జిల్లా శిరివెళ్ల ఎంఈఓ-1 శంకరప్రసాద్ పని చేస్తుండేవారు. వీరిద్దరూ ఇతర జిల్లాల్లో రెగ్యులర్ ఎంఈఓలుగా ఉంటూ ఇక్కడ ఇన్‌చార్జ్ డీవైఈఓలుగా పని చేయడం ఇబ్బందిగా ఉందంటూ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా విన్నవించారు. దీంతో వారిని ఇన్‌చార్జ్‌లుగా తప్పించి కొత్తగా ఇదే జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు ఎంఈఓలకు డీవైఈఓలుగా ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు.

నయా చీటింగ్

- పెచ్చుమీరుతున్న ఆర్థిక మోసాలు
- చిట్టీల పేరుతో కుచ్చుటోపీ
- ఉద్యోగుల నుంచి సామాన్యుల దాకా సమిధలు

కుటుంబ అవసరాలు, పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేయాలనుకున్న వారు చిట్‌ఫండ్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద నమ్మకంతో చిట్ వేస్తున్నారు. అయితే డిపాజిట్ సొమ్మును కొందరు వ్యక్తులు, సంస్థల నిర్వాహకులు తమ వ్యక్తిగత ఆస్తులు పెంచుకునేందుకు, జల్సాలు తీర్చుకునేందుకు మళ్లించేస్తున్నారు. వ్యవధి దాటినా డబ్బు తిరిగిరాక పోయేసరికి నిలువునా మోసపోయామని తెలిసి బాధితులు కుంగిపోతున్నారు. ఈ నయవంచకుల చేతిలో ఎక్కువగా సమిధలవుతోంది ఉద్యోగులు, సామాన్యులే.

గడిచిన మూడేళ్లలో జిల్లాలో జరిగిన చిట్, ఆర్థిక మోసాలు..

సంస్థ	ఐపీ పెట్టిన సొమ్ము
ఈ- బిడ్	రూ.200 కోట్లు
ఆదరణ చిట్‌ఫండ్	రూ.60 కోట్లు
జయలక్ష్మి (చిట్స్)	రూ.20 కోట్లు
నజీర్, కానిస్టేబుల్ (చిట్టీలు)	రూ.10 కోట్లు
రమేష్ టీచర్ (చిట్టీలు)	రూ.5 కోట్లు
రాయదుర్గం టీచర్ (చిట్టీలు)	రూ. కోటి
ఇతరత్రా సంస్థలు/వ్యక్తులు	రూ.50 కోట్ల పైనే



- సునీల్ అనే ఓ మెడికల్ రెప్‌కు ఈ-బిడ్ ఏజెంటు అధిక డబ్బు వస్తుందని ఎర చూపాడు. దీంతో సునీల్ దాచుకున్న డబ్బు రూ.48 లక్షలు ఈ-బిడ్‌లో కట్టాడు. మూణ్నెళ్లు తిరక్కుండానే సంస్థ బోర్డు తిప్పేసింది. సునీల్‌కు ఇద్దరు చిన్నారులున్నారు. కుటుంబం వీధిన పడింది.
- అనంతపురంలో పేరుమోసిన జనరల్ సర్జన్ ఆయన. ప్రభుత్వ వైద్యుడిగా రిటైర్ అయ్యారు. శేషజీవితంలో క్లినిక్ నడుపుకుంటున్న ఆయనకు ఆదరణ చిట్స్ నిర్వాహకులు విల్లా (బంగ్లా) ఆశ చూపారు. రాప్తాడు మండలం హంపాపురం దగ్గర ఓపెన్ విల్లా చూసిన ఆయన ఆకర్షితులై రూ.25 లక్షలు డిపాజిట్ చేశారు. అంతే..డబ్బు పోయింది కానీ విల్లా రాలేదు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం : రూపాయి రూపాయి కూడబెట్టి మూటగట్టిన సామాన్యుల సొమ్మును మోసగాళ్లు గద్దల్లా తన్నుకుపోతున్నారు. వడ్డీ రూపంలో అదనంగా ఇస్తామనో, డిపాజిట్ చేస్తే రెండు రెట్లు అధికంగా వస్తుందనో ఆశ చూపి వందల కోట్ల రూపాయలు ముంచిన ఘటనలు జిల్లాలో చాలామందిని కోలుకోలేకుండా చేశాయి. ఇల్లు కట్టుకుందామని, పిల్లలకు పెళ్లి చేద్దామని, పిల్లల పై చదువులకని ఎంతో ఆశగా కట్టిన డబ్బులు ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలు, చిట్టీలు వేసే వ్యాపారులు, గొలుసుకట్టు సంస్థల నిర్వాహకులు స్వాహా చేసి నిండా ముంచారు. సంపాదించిన డబ్బు జల్సారాయుళ్ల పాలు కావడంతో బాధిత కుటుంబాలు బోరున విలపిస్తున్నాయి.

కోలుకోలేని దెబ్బతీసిన ఈ-బిడ్

ఈ-బిడ్ సంస్థకు ఊరూ పేరూ ఏమీ లేదు. ఒక బోర్డు తగిలించి లక్ష కడితే నెలకు రూ.30వేలు ఇస్తామని ప్రచారం చేశారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోలోమని ఎగబడి మరీ కట్టారు. ఆ సంస్థ ఊరూరా ఏజెంట్లను నియమించి మరీ కట్టించుకుంది. ఉన్నట్టుండి ఒకరోజు అర్ధరాత్రి బోర్డు తిప్పేసింది. దీంతో వేలాదిమంది వీధిన పడ్డారు. దాదాపు రూ.200 కోట్లు ముంచారు. ఈ-బిడ్ సంస్థ కేసులో నిందితుడైన సునీల్ జైల్లో ఉన్నాడు. బెయిలొచ్చినా బయటకు రావడం లేదని సమాచారం. అత్యాశకు పోయిన పలువురు టీచర్లు, పోలీసులు కూడా ఈ-బిడ్‌లో డబ్బు కట్టి విలవిలలాడుతున్నారు.

ఆదరణ పేరుతో దారుణంగా..

ఆదరణ చిట్స్ అంటే అనంతపురంలో తెలియని వారుండరు. పెద్ద పెద్ద విల్లాలు, ప్లాట్‌లు చూపించి ఆశలు రేపడంతో చాలామంది చిట్‌లు కట్టడం, ఆ డబ్బును అక్కడే డిపాజిట్ చేయడం, దానికి వచ్చే వడ్డీని మళ్లీ చిట్ వేయడం చేశారు. చిట్స్ యాజమాన్యం తమ వినియోగదారులను నిలువునా మోసం చేసింది. సుమారు రూ.60 కోట్లకు ఐపీ పెట్టింది. చిట్ యజమానులు అనంతపురం సెంట్రల్ జైల్లో ఉన్నారు. బాధితులు మాత్రం డబ్బు పోగొట్టుకుని వేదన చెందుతున్నారు.

కొంపముంచుతున్న చిట్‌ల వ్యాపారం

జిల్లాలో జయలక్ష్మిని ఎవరూ మర్చిపోరు. ఖరీదైన చీరలు కట్టేది. నగలు నట్రా చాలా డాబుగా ఉండేది. విలాసవంతమైన కార్యాలయం చూసి ఆమె వద్ద వందలాది మంది చిట్ వేశారు. వచ్చిన సొమ్మును భద్రపరుచుకున్న జయలక్ష్మి ఉన్నట్టుండి లగేజీ సర్దుకుని వెళ్తుంటే ఎస్కే యూనివర్సిటీ దగ్గర చిట్ సభ్యులు పట్టుకున్నారు. అయితే అప్పటికే ఆమె సుమారు రూ.20 కోట్లకు ఐపీ పెట్టేసింది. ఈ కేసులో జైలుకెళ్లి బెయిలుపై బయటికొచ్చింది. బాధితులు మాత్రం లబోదిబోమంటున్నారు.

ప్రైవేటు వ్యక్తుల చిట్టీలను నమ్మొద్దు



రిజిస్ట్రేషన్ గానీ, అధికారిక లైసెన్సు గానీ లేకుండా చిట్స్ నడిపే సంస్థలు, కార్యాలయాలు, ప్రైవేట్ వ్యక్తులను నమ్మకండి. ఎక్కువ డబ్బు వస్తుందని ఆశ పడి చిట్టీలు కడితే అసలుకే మోసం వస్తుంది. మీకు నమ్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకులు, పోస్టాఫీసులు వంటివాటిల్లో డబ్బును భద్రపరుచుకోండి. అనధికారిక చిట్టీలు వేసే వ్యక్తులు, సంస్థల గురించి సమాచారం ఇస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– అన్బురాజన్, ఎస్పీ, అనంతపురం

మొన్న టీచర్ రమేష్ చేసిన దురాగతమూ ఇదే. చిట్టీల పేరుతో రూ.5 కోట్లకు టోపీ పెట్టారు. నిన్న రాయదుర్గం నియోజకవర్గంలో పనిచేసే ఉపాధ్యాయుడు చేసిన పాపమూ ఇదే. చిట్టీల పేరుతో బాధితులను నిండా ముంచారు. మోసం చేస్తే కేసు పెడతారు... నాలుగురోజులు జైల్లో ఉండి బెయిల్‌మీద బయటకు రావచ్చులే అనే ధీమాతో ఈ మోసాలకు తెగబడుతున్నారు.

రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత



విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 23న సత్యసాయి జయంతి సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 22న పుట్టపర్తిలో పర్యటిస్తారన్నారు. ఆ రోజు వాయుసేన విమానంలో సత్యసాయి విమానాశ్రయం చేరుకుని.. అక్కడి నుంచి ప్రశాంతి నిలయం వెళ్తారన్నారు. రోడ్డు మార్గంలో ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రపతి సభావేదిక అయిన సాయిహీరా కన్వెన్షన్ హాలు వద్ద భద్రతా లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ సత్యసాయి జయంత్యుత్సవాలు ముగిసే వరకూ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అంతకుముందు కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీలు అమ్మిరెడ్డి, రవి ప్రకాశ్, ఎస్పీ మాధవరెడ్డి, అనంతపురం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తదితరులు విమానాశ్రయం, ప్రశాంతి నిలయం పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంతృప్తికర పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 437 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఒక్క అర్జీ కూడా రీ-ఓపెన్ కాకూడదన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఆదేశించారు. అదే క్రమంలో అర్జీదారునికి తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

అర్జీల్లో కొన్ని...

- ఉప్పరపల్లి పొలం సర్వేనంబరు 107/1 నుంచి 7 వరకు గల ప్రభుత్వ భూమిలో ఒకటిన్నర సెంటు చొప్పున 69 మందికి 2011 సంవత్సరంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, నిర్మాణాలు చేపట్టేందుకు వెళ్లిన ప్రతిసారీ ఎవరో ఒకరు అడ్డు తగిలి ఇబ్బంది పెడుతున్నారని అంగన్‌వాడీ వర్కర్లు నక్షత్ర, తదితరులు అర్జీ సమర్పించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.
- తమకు 1988లో సర్వేనంబరు 337-8లో రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే ఇప్పుడు ఇద్దరు వ్యక్తులు ఆ భూమిని కబ్జా చేశారని, వారి నుంచి తమ పొలం ఇప్పించాలని అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన నాగలక్ష్మి విన్నవించింది.

రోజూ 65 వేల మంది కూలీలకు 'ఉపాధి'

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రోజూ 65 వేల మంది కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ, కులగణన, జగనన్న ఆరోగ్య సురక్ష, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, తదితర అంశాలపై కలెక్టర్ సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి మండల, డివిజన్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కరువు పరిస్థితుల నేపథ్యంలో ఉపాధి పనులు మరింత ఎక్కువ మందికి కల్పించాలన్నారు. జిల్లాలో 2.60 లక్షల కుటుంబాలలో 4.65 లక్షల మంది కూలీలు ఉన్నారన్నారు. అందరికీ 100 రోజులు పని కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో కులగణన సర్వే ఈ నెల 27వ తేదీ నుంచి పక్కాగా నిర్వహించాలని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా ఎంత మందికి లబ్ధి చేకూరిందనే వివరాలను సిద్ధం చేయాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

మార్కుల మెమోలు ఇవ్వడం లేదని ఫిర్యాదు



బాధిత విద్యార్థులు

డీఈడీ కోర్సు పూర్తయిన తమకు మార్కుల మెమో ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం ఇబ్బంది పెడుతోందని విద్యార్థులు మెహద్ నవాజ్, సౌమ్య, నీలావతి, మెహర్ తదితరులు 'స్పందన'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని విజయభారతి డైట్ కళాశాలలో 2020-2022 బ్యాచ్‌లో 63 మంది డీఈడీ పూర్తి చేశారన్నారు. తాము కళాశాలకు సంబంధించిన అన్ని ఫీజులూ చెల్లించేశామన్నారు. ఈ ఏడాది అక్టోబరు పదో తేదీన బుక్కరాయసముద్రం పోస్టాఫీసుకు మార్కుల మెమోలు వచ్చాయన్నారు. తాము అక్కడికి వెళ్లి అడిగితే కళాశాల సిబ్బంది ఒకరు వచ్చి అన్నింటినీ తీసుకెళ్లారని చెప్పారన్నారు. కళాశాలలో సంప్రదిస్తే ఒక్కొక్కరు రూ.35వేలు కడితేనే మార్కుల మెమో ఇస్తామని కరాఖండిగా చెప్తారన్నారు. తమకు న్యాయం చేయాలని విద్యార్థులు కోరారు. కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులను పిలిపించి కళాశాలకు వెళ్లి యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించి మార్కుల మెమో ఇప్పించాలని ఆదేశించారు.

ఆంధ్ర- తమిళనాడు మ్యాచ్ డ్రా

అనంతపురం: బీసీసీఐ కూచ్ బెహర్ అండర్-19 (మెన్) క్రికెట్ టోర్నీలో భాగంగా అనంతపురం ఆర్డీటీ మైదానంలో ఆంధ్రప్రదేశ్- తమిళనాడు జట్ల మధ్య నిర్వహించిన నాలుగు రోజుల మ్యాచ్ డ్రాగా ముగిసింది. తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 428 పరుగులు చేయగా, ఆంధ్ర 318 పరుగులకే ఆలౌట్ అయింది. తమిళనాడు రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తర్వాత ఆంధ్ర మ్యాచ్ ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా తమిళనాడుకు మూడు పాయింట్లు దక్కాయి. ఆంధ్ర జట్టు ఒక పాయింట్‌తో సరిపెట్టుకుంది.

ట్రెజరీ విశ్రాంత అధికారి ఇంట్లో చోరీ



చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

- బంగారు, వెండి వస్తువులతో పాటు నగదు అపహరణ

గుంతకల్లు రూరల్: ట్రెజరీ విశ్రాంత అధికారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. అర కిలో బంగారు, రెండున్నర కిలోల వెండి వస్తువులతో పాటు నగదు అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. విశ్రాంత అసిస్టెంట్ ట్రెజరీ అధికారి రామభూషణ్ రాజు గుంతకల్లు పట్టణంలోని కసాపురం రోడ్డు సమీపాన అంజలీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు. వీరిలో ఓ కుమారుడు, కోడలు పుట్టపర్తిలో ఉంటున్నారు. మరో కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. మనవరాలిని చూసుకునేందుకని రెండువారాల కిందట రామభూషణ్‌రాజు భార్య పుట్టపర్తికి వెళ్లింది. అప్పటి నుంచి విశ్రాంత ఉద్యోగి ఒకరే ఇంట్లో ఉండేవారు. వారం కిందట ఆయన కూడా పుట్టపర్తికి వెళ్లారు. పని మనిషి మాత్రం రెండు రోజులకోసారి వచ్చి పక్కింటి వారి వద్దనుంచి తాళం చెవి తీసుకుని గేటు తీసి.. కాంపౌండ్ పరిసరాలు శుభ్రం చేసి వెళ్లేది. రోజుల తరబడి ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దుండగులు ఆదివారం రాత్రి చోరీకి పథకం వేశారు. గ్రిల్ తలుపునకు ఉన్న తాళం పగులగొట్టి, ఆ తరువాత చెక్క తలుపు తాళం కొండీని విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి అందిన కాడికి ఎత్తుకుపోయారు. సోమవారం ఉదయం శుభ్రం చేసేందుకు పనిమనిషి వచ్చింది. అయితే అప్పటికే ఇంటి తలుపు తెరిచి ఉండటంతో వెంటనే పక్కింటి వారికి, ఇంటి యజమానికి సమాచారమందించింది. పుట్టపర్తి నుంచి రామభూషణ్‌రాజు హుటాహుటిన బయల్దేరి గుంతకల్లుకు చేరుకున్నారు. ఇంట్లోకెళ్లి చూడగా రెండు బెడ్‌రూముల్లోని బీరువాలు, అల్మారాల్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటం చూసి చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, కసాపురం ఎస్ఐ గోపాలుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 55 తులాల బంగారంతో పాటు 2.5 కిలోల వెండి వస్తువులు, రూ.62 వేలు చోరీ అయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతపురం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ సభ్యులు ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు.

● పరమేశ్వరా ప్రణమామ్యహం



పూజలందుకున్న కాశీ విశ్వేశ్వరుడు





హెచ్చెల్సీ వద్ద శివాలయంలో పూజలు చేయిస్తున్న భక్తులు, అనంతపురం మొదటిరోడ్డు శివాలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక మాసంలో వచ్చిన తొలి సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా అంతటా ప్రధాన శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకాలు, బిల్వ, మారేడు పత్రాలతో అభిషేకాలు, అలంకార సేవలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. దీపాల వెలుగులో ఆలయాలు శోభను సంతరించుకున్నాయి.

- అనంతపురం కల్చరల్:

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం


మృతుడు సాయికృష్ణ

ఉరవకొండ: తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన రైతు రామాంజినేయులు కుమారుడు సాయికృష్ణ (23) బీటెక్ పూర్తి చేసి, ఇంటి పట్టునే ఉంటున్నాడు. ఏదైనా పని చూసుకోవాలని పలుమార్లు తండ్రి సూచించినా పెడచెవిన పెడుతూ వచ్చాడు. తన వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు తరచూ డబ్బు కావాలంటూ తండ్రిని వేధించేవాడు. ఈ క్రమంలో సోమవారం డబ్బు కోసం తండ్రితో గొడవ పడ్డాడు. పని చూసుకుని డబ్బు సంపాదించుకోవాలని, ఇకపై తాను ఇవ్వనంటూ తండ్రి మందలించడంతో ఇంట్లోకి వెళ్లి క్రిమి సంహారక మందు తాగాడు. ఆలస్యంగా ఈ విషయం గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే సాయికృష్ణను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఎస్ఐ వెంకటస్వామి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీఎంకేవీవై కోర్సుల్లో భాగంగా ఎంఎస్ ఆఫీస్‌పై మూడు నెలల పాటు శిక్షణ కొనసాగుతుంది. 15 నుంచి 35 ఏళ్ల వయసుండి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు బయోడేటాతో పాటు పదో తరగతి మార్కుల జాబితా, కలర్ ఫొటో, ఆధార్ కార్డు నకలును ఈ నెల 25వ తేదీలోపు ఐటీఐలో అందజేయాలి. 26న ఇంటర్వ్యూలు ఉంటాయి. కోర్సు పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ అందజేసి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు కోర్సు కో–ఆర్డినేటర్ (79954 82414)ను సంప్రదించవచ్చు.

జీన్స్ ఉత్పత్తుల దుర్గం

- రాయదుర్గంలో వెయ్యికి పైగా చిన్న, పెద్ద పరిశ్రమలు
- యువత అభిరుచులకు అనుగుణంగా డిజైన్ల తయారీ
- దేశంలోని ప్రముఖ నగరాలకు ఎగుమతి
- ప్రత్యక్షంగా 60 వేల మందికి కుట్టుతో జీవనోపాధి


రాయదుర్గంలోని ఓ పరిశ్రమలో పనిలో నిమగ్నమైన కుట్టు కార్మికులు

రాయదుర్గం: కర్ణాటకకు కూతవేటు దూరంలో జిల్లా సరిహద్దున ఉన్న రాయదుర్గం పట్టణం.. జీన్స్ ఉత్పత్తులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మారుతున్న యువత అభిరుచులకు అనుగుణంగా జీన్స్ ప్యాంట్ల తయారీలో ఇక్కడి కార్మికులు నిష్ణాతులుగా ఖ్యాతిగాంచారు. అంతేకాక ఇక్కడి జీన్స్ ఉత్పత్తులు ఉమ్మడి తెలుగు రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. రాయదుర్గం ప్రాంతంలో వెయ్యి వరకూ చిన్న, పెద్ద తరహా జీన్స్ పరిశ్రమలున్నాయి. వీటన్నింటిలో 60 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. రోజూ ఎంత తక్కువగా లెక్కించుకున్నా లక్షకు పైగా ప్యాంట్ల ఉత్పత్తి జరుగుతోంది. ఈ లెక్కన ఏడాదికి సగటున రూ.800 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్ల వరకూ టర్నోవర్ ఉంటుందని అంచనా. మార్కెట్ ధర కంటే చౌకగా లభిస్తుండడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, యువత నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు ఆన్‌లైన్ ద్వారా కొనుగోళ్లు సాగిస్తున్నారు.

జీన్స్ క్రేజే వేరు

ఫ్యాషన్ ప్రపంచంలో ఎన్ని రకాల దుస్తులు వచ్చినా జీన్స్‌కు ఉన్న క్రేజే వేరు. ఈ క్రమంలో రాయదుర్గంలో జీన్స్ దుస్తుల తయారీకి సంబంధించిన అన్ని పనులూ జరుగుతుంటాయి. ఇందుకోసం నిపుణులైన కుట్టు కార్మికులూ ఉన్నారు. లేటెస్ట్ ట్రెండ్‌కు తగినట్లుగా జీన్స్ ప్యాంట్లు, కోట్లు తయారు చేయడం వీరి ప్రత్యేకత. ముంబై, ఢిల్లీ, బెంగళూరు లాంటి నగరాల్లో యూత్ ఎక్కువగా ఏ డిజైన్స్‌ను ఇష్టపడుతున్నారన్నది గమనిస్తారు. వాటినే ఇక్కడి వ్యాపారులు చేయిస్తున్నారు. షేడ్ జీన్స్, పెన్సిల్ కట్, నెటెడ్ వంటి వాటిని తయారు చేయడంలో వీరు మంచి నిష్ణాతులుగా పేరుగాంచారు. ఒకప్పుడు కుటీర పరిశ్రమగా ఏర్పడిన జీన్స్ ప్యాంట్ల తయారీ ఇప్పుడు పల్లెలకూ విస్తరించింది.

చైనా నుంచి ముడిసరుకు

జీన్స్ ప్యాంట్ల తయారీకి అవసరమైన వస్త్రం, జిప్పులు, గుండీలు, దారం వంటి ముడి సరుకును చైనాతో పాటు దేశంలోని అహ్మదాబాద్, బిల్వార్, బళ్లారి ప్రాంతాల నుంచి ఇక్కడి గార్మెంట్స్ పరిశ్రమల నిర్వాహకులు దిగుమతి చేసుకుంటున్నారు. గతంలో వడ్డీతో కూడిన అరువుపై ముడిసరుకును తెచ్చుకునేవారు. కరోనా తర్వాతి పరిస్థితుల కారణంగా నగదు లావాదేవీలే కొనసాగుతున్నాయి. ఈ కారణంతో చిన్న పరిశ్రమల నిర్వహణ భారంగా మారిందని యజమానులు పేర్కొంటున్నారు.


ఇతని పేరు దాదు. రాయదుర్గంలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమలో జీన్స్ ప్యాంట్ల కటింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ 600 నుంచి 800 వరకూ ప్యాంట్లను కట్ చేసి కుట్టు కార్మికులకు అందిస్తాడు. దీంతో ఒక్కరోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు ఆదాయం గడిస్తున్నాడు.


ఇతను రహిమాన్. రాయదుర్గం నివాసి. రోజూ 600 నుంచి 700ల వరకు ఫీడ్‌ఫామ్ (ఇన్‌సైడ్) ప్యాంట్లను కుడుతుంటాడు. ఒక్కో పీసుకు రూ.1.50 చొప్పున గరిష్టంగా రూ.750 వరకు ఆదాయం ఉంటోంది.


ఇతని పేరు సంతోష్‌నాయక్. రాయదుర్గం మండలం ఆవులదట్ల గ్రామం. పీస్ వర్క్ కింద రోజూ ఎంత లేదన్నా.. రూ.500లు సంపాదన ఉంటోంది. ఇలా ఈ ముగ్గురే కాదు... రాయదుర్గం ప్రాంతంలోని జీన్స్ పరిశ్రమల్లో కటింగ్ మొదలు... ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు తరలించే వరకూ గరిష్టంగా 60 వేల మంది కార్మికులకు జీవనోపాధి ఉంటోంది.

ఇంట్లో అందరూ కుట్టుపనే


దాదాపు 17 ఏళ్లుగా జీన్స్ ప్యాంట్ల కుట్టుతోనే జీవనోపాధి పొందుతున్నాం. నాతో పాటు కుమార్తె, కుమారుడు కూడా పనిచేస్తున్నారు. ముగ్గురమూ కలసి నెలకు రూ.24 వేల వరకూ సంపాదిస్తున్నాం.

– మల్లమ్మ, 74 ఉడేగోళం, రాయదుర్గం మండలం

ఆర్థిక ఇబ్బందుల్లేవు


ఆర్థిక ఇబ్బందులతో ఐదేళ్ల క్రితం మధ్యలోనే చదువు మానేశాను. ప్రస్తుతం జీన్స్ ప్యాంట్లు కుడుతూ ప్రతి నెలా రూ.10 వేలకు పైగా సంపాదిస్తున్నా.

– రోజా, కుట్టు కార్మికురాలు, భూసముద్రం

కార్మికులకు ఉపాధి


మా పరిశ్రమలో కాటన్ ప్యాంట్ల తయారీకి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాం. ఇక్కడి ఉత్పత్తులను పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాం. జీన్స్ పరిశ్రమల ద్వారా వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాం.

–కొంతెం దేవరాజు, గార్మెంట్స్ యజమాని, రాయదుర్గం


ఓ పరిశ్రమలో ప్యాంట్లకు దారాలు తొలగిస్తున్న కూలీలు

దుర్గం జీన్స్ ప్రత్యేకతే వేరు


రాయదుర్గంలో జీన్స్ పరిశ్రమల అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించారు. వన్ డిస్ట్రిక్ట్– వన్ ప్రొడక్ట్‌లోనూ రాయదుర్గం జీన్స్‌కు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం దక్కేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మార్కెటింగ్ వ్యవస్థ పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముడి సరుకును రాయితీతో అందించే అంశంపై ఇప్పటికే సీఎం జగన్‌తో చర్చించాం. భవిష్యత్తులో జీన్స్ పరిశ్రమ యాజమాన్యాలు, కార్మికులకు అన్ని విధాలుగా మేలు చేకూరుతుంది.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

జనవాక్కు

అద్దె బాధ తప్పింది


కొన్నేళ్ల క్రితమే నన్ను, కుటుంబాన్ని వదిలి నా భర్త వెళ్లిపోయాడు. నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడితో కలసి 30 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే జీవనం సాగిస్తున్నా. గాజుల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. సొంతిల్లు కోసం గత ప్రభుత్వంలో లెక్కలేనన్ని అర్జీలు ఇచ్చాను. మంజూరు కాలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత నాకు కురాకుల తోట జగనన్న కాలనీలో పట్టా ఇచ్చి, ఇల్లు కట్టిచ్చారు. ప్రస్తుతం సొంతింట్లోనే ఉంటున్నా. దీంతో నెలకు రూ.4 వేల అద్దె కట్టే బాధతప్పింది. సొంతింటి కలసాకారం చేసిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. – నబియాభాను, కళ్యాణదుర్గం

కల నెరవేరింది


దాదాపు 15 ఏళ్లుగా రాయదుర్గంలోని వివిధ ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో కాలం నెట్టుకొచ్చాం. నా భర్త శ్రీనివాసులు బొరుగుల బట్టీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నేను కూడా ఇంట్లోనే కుట్టు పని చేస్తుంటా. టీడీపీ హయాంలో ప్రతి జన్మభూమి కార్యక్రమంలోనూ దాదాపు ఓ పదిసార్లు అర్జీ ఇచ్చి ఉంటా. ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సీఎం జగనన్న మా కల నెరవేర్చారు. మాకు రేషన్‌కార్డు వచ్చింది. బీటీపీ లే అవుట్‌లో ఇంటి స్థలం, రుణం మంజూరు కావడంతో నిర్మాణ పనులు పూర్తయి గృహ ప్రవేశం కూడా చేశాం. ఇదంతా సీఎం వైఎస్ జగన్ చలువ.

– కళావతి, బీటీపీ లే అవుట్ జగనన్న కాలనీ, రాయదుర్గం

సొంతిల్లు సీఎం జగన్ చలువనే


నేను, నా భర్త చంద్రశేఖర్ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం అధికారులను, నాయకులను వేడుకున్నాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి వివరాలు తీసుకెళ్లాడు. ఆఫీసు వద్దకు నేను వెళ్లను కూడా వెళ్లలేదు. ఎవరినీ ప్రాధేయపడిందీ లేదు. అయినా ప్రభుత్వం మాకు ఇంటి పట్టా మంజూరు చేసింది. వలంటీరే ఇంటి వద్దకు తెచ్చిచ్చాడు. మాకు సొంతిల్లు వచ్చిందంటే అదంతా సీఎం వైఎస్ జగనన్న చలువనే.

–ఎస్.పుష్పావతి, కొత్తపేట, గుత్తి మండలం

నా ఆయుష్షు కూడా పోసుకుని...


ఒళ్లు నొప్పులు భరించలేకున్నా. ఎంత మంది డాక్టర్లకు చూపించినా నయం కావడం లేదు. మందులు వేసుకుంటే కాస్త బాగుంటుంది. లేకపోతే నొప్పులు భరించడం చాలా కష్టం. అయితే ప్రతిసారీ మందులు కొనాలంటే డబ్బు లేక ఇబ్బంది పడేదాన్ని. ఈ పరిస్థితుల్లో ఉన్న నాకు జగనన్న ఆరోగ్య సురక్షలో ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేసి నొప్పులకు తగిన మందులు ఇచ్చారు. క్రమం తప్పకుండా వాడితే నయమవుతుందని చెప్పారు. పైసా కూడా ఖర్చు కాలేదు. మందులు అయిపోతే వలంటీరుకు చెబితే తీసుకొచ్చి ఇస్తున్నాడు. ఇప్పుడెంతో బాగుంది. గతంలో ఎన్నడూ ఇలాంటి చికిత్స చూడలేదు. నా ఆయుష్షు కూడా పోసుకుని సీఎం వైఎస్ జగన్ ప్రజలకు మరింత మంచి సేవలు చేయాలని దేవుడినికోరుకుంటున్నా.

–కోనా వెంకటనారాయణమ్మ, కోనుప్పలపాడు గ్రామం, యాడికి మండలం

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

- ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ గౌతమి పిలుపు


ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు, ధ్రువీకరణ పత్రాలను ఆమె పంపిణీ చేశారు. విభిన్నప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఏడీ రసూల్, ట్రాన్స్‌జెండర్లు శ్రావణి, గోపిక, మధు తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప యాత్ర జయప్రదం చేయండి

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సంకల్ప యాత్ర నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ నెల 26వ తేదీ నుంచి 60 రోజుల పాటు సంకల్ప యాత్ర చేపట్టాలన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, మెప్మా పీడీ విజయలక్ష్మి, డీపీఓ ప్రభాకరరావు, ఎల్‌డీఎం సత్యరాజ్, డీఎస్ఓ శోభారాణి, డీటీసీ వీర్రాజు, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహషాన్‌బాషా, డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నాగరాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటకలో అదృశ్యం.. అనంతలో ప్రత్యక్షం

- హోం వర్క్ చేయలేదని ఉపాధ్యాయుడి చేతిలో దెబ్బలు
- రైలెక్కి వచ్చేసిన విద్యార్థి
- క్షేమంగా కుటుంబసభ్యులకు అప్పగింత


బాలుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, తదితరులు

అనంతపురం సిటీ: హోం వర్క్ చేయకపోవడంతో ఉపాధ్యాయుడు దండిస్తూ చెయ్యి చేసుకోవడంతో భయపడిన ఓ విద్యార్థి బెంగళూరుకు వెళ్లే రైలు ఎక్కాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే అప్రమత్తమై అనంతపురంలో బాలుడిని అదుపులోకి తీసుకుని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి ఎదుట హాజరుపరిచారు. వివరాలు... కర్ణాటకలోని రాయచూరు జిల్లా దేవదుర్గకు చెందిన నూర్జహాన్ బేగం, హబీబ్‌బాషా దంపతుల కుమారుడు సాకత్ అలీ... అదే ఊళ్లోని హాస్టల్‌లో ఉంటూ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. హోం వర్క్ చేయకపోవడంతో ఆదివారం ఉపాధ్యాయుడు గట్టిగా మందలిస్తూ కొట్టాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలుడు పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. విషయాన్ని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే సమాచారం అందించడంతో అన్ని పోలీస్ స్టేషన్లతో పాటు రైల్వే పోలీసులనూ అక్కడి పోలీసులు అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న అనంతపురం ఆర్పీఎఫ్ ఎస్ఐ మధుసూదనాచారి, జీఆర్పీ ఎస్ఐ విజయ్ కుమార్, సిబ్బంది సోమవారం రాయచూరు నుంచి వస్తున్న రైళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మిషన్ వాత్సల్య విభాగం డీసీపీఓ వెంకటేశ్వరి, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణమాచారి, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సోషల్ వర్కర్ నాగలక్ష్మి కూడా రైల్వే స్టేషన్‌కు చేరుకుని ఆరా తీశారు. ఇంతలో సాయంత్రం అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న బెంగళూరుకు వెళ్లే రైలుతో బాలుడిని గుర్తించి, స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడి చిన్నాన్న నవాబ్‌జాన్‌ను పిలిపించి మాట్లాడారు. అనంతరం సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి ఎదుట బాలుడిని హాజరుపరిచి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఐడీబీఐలో అగ్ని ప్రమాదం


బ్యాంకులోని ఫర్నీచర్ దగ్ధమైన దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలోని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) శ్రీకంఠం సర్కిల్ శాఖలో సోమవారం ఉదయం 9 గంటలకు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బ్యాంక్ నుంచి దట్టమైన పొగలు వస్తుండడం గమనించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు తెలిపారు. కొన్ని ఫైళ్లతో పాటు ఫర్నీచర్, కంప్యూటర్లు కాలి బూడిదయ్యాయన్నారు. ఖాతాదారులకు సంబంధించిన ఫైళ్లు, నగదు, తాకట్టులో ఉన్న బంగారు నగలకు ఎలాంటి ప్రమాదం లేదని బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు. మరో రెండు రోజుల్లో సేవలు పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు.

కర్నూలు జిల్లా వాసి ఆత్మహత్య

పామిడి: ప్రేమించిన యువతి దూరం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... కర్నూలు జిల్లా అంకిరెడ్డిపల్లికి చెందిన మధు కుమారుడు మనోజ్ (20), అదే గ్రామానికి చెందిన సమీప బంధువైన యువతిని ప్రేమించాడు. అయితే ఆమెకు వేరే వ్యక్తి కుటుంబసభ్యులు వివాహం చేశారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులకు తెలియకుండా పది రోజుల క్రితం ఆమెను పిలుచుకొచ్చి పామిడిలోని బీసీ కాలనీలో కాపురం పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న ఆమె కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం పామిడికి చేరుకుని మనోజ్‌ను మందలించి తమ వెంట పిలుచుకెళ్లారు. వివాహితను వీడి ఉండలేని మనోజ్ కూడా అంకిరెడ్డిపల్లికి వెళ్లి ఆమెను పిలుచుకువచ్చే ప్రయత్నం చేశాడు. అయితే అక్కడ అతని మాటకు ఎవరూ విలువనివ్వకపోవడంతో అదే రోజు సాయంత్రం పామిడికి చేరుకున్నాడు. సోమవారం సాయంత్రమైన ఇంటి తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారు పరిశీలించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న మనోజ్‌ను గమనించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మనోజ్ మృతదేహాన్ని పామిడి సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గోదాములో రూ.2.79 కోట్ల విలువైన సరుకు మాయం

తాడిపత్రిటౌన్: మండలంలోని చిన్నపోలమడ సమీపంలో ఉన్న చౌకధాన్యపు గోదాము నుంచి రూ.2.79 కోట్ల విలువైన బియ్యం, కందిబేడలు, చక్కెర, రాగులు, గోధుమ పిండి మాయమైంది. గత మూడు రోజులుగా విజిలెన్స్, రెవెన్యూ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఈ అంశం వెలుగు చూసింది. తనిఖీలు సోమవారంతో ముగిశాయి. అక్రమాలు వెలుగు చూడడంతో గోదామును అధికారులు సీజ్ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలంటూ నివేదికను తాడిపత్రి తహసీల్దార్ అలెగ్జాండర్‌కు అందజేసినట్లు విజిలెన్స్ సీఐ రామారావు, ఎస్ఐలు శేషగిరి, జయపాల్‌రెడ్డి తెలిపారు.

'పోలీసు స్పందన'కు 175 వినతులు

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 175 వినతులు అందాయి. వినతులను నగర డీఎస్పీ ప్రసాదరెడ్డి స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సూచించారు.

పచ్చని పంటను నాశనం చేస్తున్నారు..

ఏటా సాగు చేసిన పంటను కొందరు కావాలని ట్రాక్టర్లతో తొలగించి అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన మహిళా రైతు నీలావతి వాపోయింది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీ అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడింది. తన భర్తకు పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన 5.5 ఎకరాల భూమిలో పప్పుశెనగ సాగు చేసినట్లు వివరించింది. రెండు రోజుల క్రితం మదమంచి సురేష్, మదమంచి అభిలాష్, ఇల్లూరు అశోక్, చింతలాంపల్లి శ్యామ్, గాయత్రి... రాత్రికి రాత్రి ట్రాక్టరుతో పంటను పూర్తిగా ధ్వంసం చేశారని ఆరోపించింది. గతేడాది కూడా ఇలాగే పంటను తొలగించారని, అప్పట్లో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఈ సారి నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు వివరించింది. దౌర్జన్యపరులపై చర్యలు తీసుకుని తమను కాపాడాలని వేడుకున్నట్లు తెలిపింది.

మహిళల అదృశ్యం కేసులో వీడిన మిస్టరీ

నార్పల: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో గత వారం అదృశ్యమైన ఇద్దరు మహిళల కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివరాలను నార్పల ఎస్ఐ రాజశేఖరరెడ్డి సోమవారం వెల్లడించారు. మాలవాండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ, మూగే తిమ్మంపల్లి గ్రామానికి చెందిన మరో మహిళ గత వారం వేర్వేరుగా కనిపించకుండా పోయారు. ఈ ఘటనలకు సంబంధించి బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదయ్యాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సాయంతో మహిళల ఆచూకీని గుర్తించి సోమవారం కుటుంబసభ్యులకు అప్పగించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

యాడికి: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను విజిలెన్స్ సీఐ వెంకటరమణ, ఏఓ వాసు ప్రకాష్ వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన విజిలెన్స్ అధికారులు సోమవారం తెల్లవారుజామున యాడికి సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహన డ్రైవర్... అధికారులను చూడగానే వాహనాన్ని ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చాడు. దీంతో అధికారులు మరో వాహనంలో వెంబడించి యాడికి సమీపంలో అడ్డుకున్నారు. బొలెరోలో 17.40 క్వింటాళ్ల రేషన్‌బియ్యం ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యం తరలిస్తున్న రవితేజారెడ్డి, యగవింటి పరుశురాంను పోలీసులకు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

24లోపు సిలబస్ పూర్తి చేయాల్సిందే

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ నెల 24 నుంచి ఎస్ఏ–1 పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలోపు అన్ని పాఠశాలల్లోనూ సిలబస్ పూర్తి చేసి తీరాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ఆర్జేడీలు, డీఈఓలు, మండల విద్యాశాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా నుంచి డీఈఓ నాగరాజు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు. ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ... ఏదైనా పాఠశాలలో సిలబస్ పూర్తి కాకుంటే 24వ తేదీలోపు పూర్తి చేసి పిల్లలను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ట్యాబ్‌ల్లో ఉండే కంటెంట్ ఆధారంగా దాదాపు 50 శాతం మార్కులకు ప్రశ్నలు ఉంటాయన్నారు. ఎక్కడైనా ట్యాబ్‌లు ఇప్పటికీ ఓపెన్ కాకపోతే ఆయా పాఠాల్లోని ప్రశ్నలు, జవాబులు నేర్చుకునేలా చూడాలన్నారు. ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌టీవీలు కచ్చితంగా తరగతి గదుల్లో ఉపయోగించాలన్నారు. ఈ విషయంలో ఇప్పటికీ ఎవరైనా కుంటి సాకులు చెబితే సహించబోకూడదన్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు



బహుమతులు అందిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఉమాదేవి

కనగానపల్లి(రాప్తాడు): గ్రంథాలయాలు వ్యక్తిత్వ వికాసానికి, విజ్ఞాన సముపార్జనకు నిలయాలని సంస్థ జిల్లా చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి తెలిపారు. రాప్తాడులో సోమవారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమానికి విశేషంగా కృషి చేసిన వెంకటరమణయ్య సేవలు ఎనలేనవన్నారు. విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేస్తే, విజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, గ్రంథాలయాధికారి గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ప్రభుత్వం బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో మహిళా శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ లైన్ 1098, జిల్లా బాలల పరి రక్షణ సమితి సంయుక్తంగా అంతర్జాతీయ బాలికల హక్కుల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదువుకొని ఉన్నతస్థాయిలో రాణించాలన్నారు. బాలికల కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డయల్ 100, 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 1118ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బాలికల సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ లింగానాయక్, 1098 చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి, కేజీబీవీ పాఠశాల ఇన్‌చార్జ్ అధికారి భవాని, డీసీపీయూఓఆర్‌డబ్ల్యూ వసంత, సీహెచ్‌ఎల్ స్టాఫ్ ఇర్ఫాన్, సురేష్, నాగలక్ష్మి, సుహాసిని, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న డీసీసీబీ జీఎం సురేఖారాణి

అనంతపురం అగ్రికల్చర్: ఈనెల 14 నుంచి ప్రారంభమైన సహకార వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో స్థానిక రాయలసీమ సహకార శిక్షణ కేంద్రంలో ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా సహకార అధికారి ఎం.ప్రభాకరరెడ్డి, డీసీసీబీ జనరల్ మేనేజర్ కె.సురేఖారాణి, డీసీసీబీ విశ్రాంత సీఈవో డాక్టర్ వేములేటి నరసింహారెడ్డి తదితరులు మాట్లాడారు. సహకార వ్యవస్థ బలోపేతం, సహకార సంఘాల ద్వారా రైతులు, ఖాతాదారులకు మెరుగైన సేవలు, సహకార రంగంపై పాలక వర్గాలు, అధికారులు, సిబ్బందికి ఉండాల్సిన అవగాహన, ప్రభుత్వం, నాబార్డు, ఆప్కాబ్ తదితర ప్రభుత్వ సంస్థల ప్రోత్సాహం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో శిక్షణ కేంద్రం అధ్యాపకులు మేధిని, కె.నాగవీణ, డీఎల్‌సీవో బాలగంగాధర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



లేహత్ చంద్రసాయిని అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు ఏపీ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయిలో చోటు దక్కించుకున్న క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 14 నుంచి 18 వరకు రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో మాస్టర్ లేహత్ చంద్రసాయి ప్రతిభ చాటి, రెండు బంగారు పతకాలు దక్కించుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా చీఫ్ కోచ్ నరసింహా రెడ్డి, ఏపీ ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర అభినందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు గురు సాయి. సిద్ధు, ఉపాధ్యక్షుడు అనిల్ బాషా, భరత్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో కుక్కల గుంపులు



బాబోయ్..కుక్కలున్నాయి జాగ్రత్త!

అనంతపురం నగరంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా 'వీధి' విహారం చేస్తున్నాయి. రెవెన్యూ కాలనీ, ఒకటో రోడ్డు, నాల్గో రోడ్డు , చంద్రబాబు నాయుడు కొట్టాలు, రుద్రంపేట, పాతూరు, రాంనగర్ ప్రాంతాల్లో కుక్కలు అధికంగా ఉన్నాయి. ప్రతి వీధిలోనూ గుంపులుగా తిరుగుతుండడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. చిన్నా, పెద్దా, వృద్ధులు, మహిళలు ఇలా ప్రతి ఒక్కరూ కుక్కల బెడదతో బెంబేలెత్తుతున్నారు. ఇటీవల కుక్కలదాడిలో గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నవారు అధికంగా ఉన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ రావాలి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందించారని, మరోమారు సీఎంగా ఆయనే ఉండాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కోరారు. సోమవారం నగరంలోని 14, 20వ సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా సంక్షేమం, అభివృద్ధి బోర్డు ఆవిష్కరించారు. అనంతరం ఆయా డివిజన్లలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేయించామని, ఇప్పటికే రూ.650 కోట్ల వరకు పనులు పూర్తయ్యాయన్నారు. అభివృద్ధి చూడలేని టీడీపీ, జనసేన నాయకులు గుంతల రోడ్లు అంటూ నిరసన తెలపడం హాస్యాస్పదమన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

18 నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి..

నగరంలోని టవర్‌క్లాక్ బ్రిడ్జిని 18 నెలల్లోనే అందుబాటులోకి తీసుకొచ్చామని ఎమ్మెల్యే అన్నారు. రుద్రంపేటలో ఇప్పటికే బ్రిడ్జి పూర్తయ్యిందని, త్వరలో రోడ్డు పనులు ప్రారంభమవుతాయని తెలిసి టీడీపీ, జనసేన పార్టీలు నిరసన తెలపడం సరికాదన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ అందరూ టీడీపీ ప్రజాప్రతినిధులేనని, కానీ ఒక్క రోడ్డూ వేయలేదన్నారు. 2019 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు నాయుడు మహిళలు మోసం చేశారన్నారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని, సీఎంగా అయ్యాక విడతల వారీగా రూ.19 వేల కోట్లు మాఫీ చేశారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో నాల్గో విడతలో రుణాలు పూర్తిగా మాఫీ చేస్తారని చెప్పారు. డ్వాక్రా మహిళలకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేసి, వారు ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు జగదీష్ ,జేసీఎస్ కన్వీనర్ లక్ష్మణ్ణ, కార్పొరేటర్లు వై లక్ష్మీదేవి, దేవి, బాబాఫకృద్దీన్, పార్టీ జిల్లా కార్యదర్శి గోగుల రాధాకృష్ణ, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, నాయకులు సత్యనారాయణ రెడ్డి, శివయ్య, చాంద్ బాషా, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక సంపదను పరిరక్షించుకుందాం

అనంతపురం కల్చరల్: జిల్లాలోని చారిత్రక సంపదను పరిరక్షించుకుందామని అధికారులు అన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పురావస్తు శాఖ, పర్యాటక శాఖ, ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో నగర వీధుల్లో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. జిల్లా టూరిజంశాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, పురావస్తు శాఖ ఏడీ రజిత, ఇంటర్ బోర్డు అధికారి వెంకటరమణ నాయక్, ఆర్ఐఓ సురేష్ ర్యాలీని ప్రారంభించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి పాతూరు జూనియర్ కళాశాల వరకు విద్యార్థులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్, మాజీ కన్వీనర్ వేణుగోపాలరెడ్డి, ఇంటాక్ ప్రతినిధులు కృష్ణమూర్తి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రియాజ్, గిరిధరరాయ్, షరీఫ్, నబీరసూల్ మాట్లాడారు.



హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న పురావస్తు, టూరిజం శాఖ అధికారులు

సీఎం జగన్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు

కనగానపల్లి (రాప్తాడు): పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలని రాప్తాడు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి తెలిపారు. సోమవారం రాప్తాడు మరూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు హేమావతి, ఎంపీటీసీ చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మరూరులో జెండాను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

తప్పతాగి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు

అనంతపురం క్రైం: తప్పతాగి ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టాడు. అదృష్టవశాత్తూ స్తంభం విరిగి అలాగే నిలబడడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం 2.45కు శ్రీనివాసనగర్‌లోని రిలయన్స్ మార్టు మలుపు వద్ద చోటుచేసుకుంది. నిమిషాల వ్యవధిలో విద్యుత్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, స్తంభాన్ని ఢీకొట్టిన కారును పక్కకు తీయగా, స్తంభం విరిగి నేలపై నిలబడింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు ఎగసిపడగా, స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించకుంటే ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా, ఘటనాస్థలానికి పోలీసులు రాకపోవడంతో విద్యుత్ అధికారులే కారు నడిపిన వ్యక్తిని ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లారు.



ప్రమాదానికి గురైన కారు




వాహనం నడిపిన డ్రైవరు ఇతనే

బాలల భద్రత అందరి బాధ్యత

• సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి

అనంతపురం సిటీ: బాలల భద్రత అందరి బాధ్యత అని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20 వరకు ప్రపంచ బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా నలంద జూనియర్ కళాశాల విద్యార్థినులతో క్యాండిల్ లైట్ ర్యాలీని సోమవారం రాత్రి నిర్వహించారు. అక్కడే మానవహారం ఏర్పాటు చేశారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలల సమాచారాన్ని చైల్డ్ హెల్ప్ లైన్–1098కు తెలిపి, వారిని సురక్షితంగా రక్షిద్దామన్నారు. ఆన్‌లైన్ సేఫ్టీ, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లు ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ వెంకటేశ్వరి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, దిశా సీఐ చిన్న గోవింద్, మూడో పట్టణ సీఐ మహమ్మద్ రఫీ, జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్, ఆర్పీఎఫ్ ఎస్ఐ మధుకరాచారి, ఏఎస్ఐలు ఎస్ఎండీ రఫీ, ప్రతాప్ నాయక్, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సోషల్ వర్కర్ నాగలక్ష్మి, న్యాయవాది సంధ్య, హెల్ప్ లైన్ సిబ్బంది నిర్మల, సుహాసిని, ఇర్ఫాన్, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి

పుస్తకాల ద్వారా వ్యక్తిత్వ వికాసం

అనంతపురం: పుస్తకాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. సోమవారం జిల్లా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తకం వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందన్నారు. వారం రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి కృషి ప్రశంసనీయమన్నారు. వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సి. శ్రీనివాస రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్‌ఎం. ఉమాదేవి, కార్యదర్శి పి.రమ, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎల్‌ఎం మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

కళ్యాణోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం సిటీ: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలోని బీఎస్‌ఆర్ కాలనీలో వెలసిన శివాలయంలో సోమవారం కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జెడ్పీలో తనిఖీలు: ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలోని అన్ని సెక్షన్లను చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలతో పాటు ఉద్యోగుల సమస్యలను విని, సానుకూలంగా స్పందించాలని ఆదేశించారు.

రహదారి భద్రతపై అవగాహన

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో 'రహదారి భద్రత'పై గ్రామీణ అభివృద్ధి సంస్థ సహకారంతో సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంవీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్ష మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. 80 వేల మందికి పైగా క్షతగాత్రులుగా మారుతున్నారన్నారు. అనేక కుటుంబాల్లో మానసిక క్షోభ మిగులుతోందన్నారు. వాహనదారులు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఆర్టీటీ చైర్మన్ తిప్పేస్వామి, నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాసులు

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ఏపీ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం నిరసన తెలియజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సంఘం గౌరవాధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, సీఐటీయూ కార్యదర్శి వెంకటనారాయణ హాజరై మాట్లాడారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, బాలాజీ నాయక్, మధు, కుళ్లాయమ్మ, ఎరినాగయ్య, పెద్దన్న, రాజు, శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు

అనంతపురం టవర్‌క్లాక్: గుడికట్ల సంబరాలు విజయవంతం చేసిన కురుబలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిజేస్తున్నట్లు కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు తుప్పటి ఈశ్వరయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కురుబ కురుబల ఆరాధ్య దేవతలైన బీరప్ప స్వాములను నగరం నడిబొడ్డున ప్రదర్శన చేసినందుకు కురుబలు, గుడికట్ల పెద్దలు, పూజారులు, గొరవయ్యలు, కోలుకాళ్లకు, గణాచారులు, డోళ్ల కళాకారులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛందంగా వాహనాలు ఏర్పాటు చేసుకొని దేవతలను పూలతో అలంకరించుకొని కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, శీనయ్య, బ్యాల్ల నాగేంద్ర, వళికేరి శివ, రాగే గోపాల్, నాగరాజు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు సాధన పరిచయ సభ

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ట్స్‌కాలేజీలోని కామర్స్ సెమినార్ హాలులో డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు గ్రహీత, సీనియర్ రచయిత శాంతి నారాయణ రచించిన 'సాధన' నవల పరిచయ సభ ఈనెల 22న జరుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రభారతి సౌజన్యంతో ఉదయం 10: 30 గంటలకు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరగనున్న సాహితీ సమావేశానికి పలువురు రచయితలు, కవులు ఆత్మీయ అతిథులుగా హాజరవుతున్నారన్నారు.

మంజునాథుడికి రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో మంజునాథుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంజునాథ స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం అనంతరం రుద్రాభిషేక నిర్వహించారు.

ఎంపీని కలిసిన కెనరా బ్యాంకు ఎండీ



ఎంపీ తలారి రంగయ్యతో మాట్లాడుతున్న సత్యనారాయణ రాజు

అనంతపురం కార్పొరేషన్: బెంగళూరు నగరంలో అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కెనరా బ్యాంకు ఎండీ సత్యనారాయణ రాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో భాగంగా ఎంపీ బెంగళూరుకు వెళ్లారు.

పట్టుదల ఉంటేనే విజయం



బహుమతులను అందిస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: పట్టుదల ఉంటేనే విజయాలు సాధించొచ్చని ఎంపీపీ సుబ్బర హేమలత అన్నారు. సోమవారం గ్రంథాలయంలో జరిగిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ చంద్రకళ, గ్రంథాలయ అధికారి నల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 3న కార్తీక వనభోజనాలు

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 3న సోములదొడ్డిలోని అశ్వర్థనారాయణ కట్ట ఆలయ ప్రాంగణంలో కార్తీక వనమహోత్సవం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. సోమవారం స్థానిక శ్రీనివాసనగర్‌లోని బాలాజీ కల్యాణ మంటపంలో వనభోజన మహోత్సవ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో బలిజ యువజన సంఘం అధ్యక్షులు రమేష్, మార్కెట్ ఆనంద్, పగడాల మల్లికార్జున, గిరిధర్, మురళీకృష్ణ, పద్మజ, కృష్ణమూర్తి, లక్ష్మీప్రసాద్, నాగేష్, చలపతి, అనిల్ కుమార్, సుబ్రమణ్యం, పెద్దన్న, రామకృష్ణ, ప్రభాకర్, నాగభూషణం , చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవునికుంట తండాకు బస్సు సౌకర్యం



డీకే తండాకు వచ్చిన ఆర్టీసీ బస్సు

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్ల పంచాయతీలో దేవునికుంట తండా (డీకే తండా)కు 28 ఏళ్ల తర్వాత సోమవారం బస్సు సర్వీసు పునరుద్ధరించారు. తండా నుంచి చదువుకునేందుకు ఆత్మకూరు, ముట్టాల, అనంతపురానికి వెళ్తారు. అయితే బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడేవారు. ఇటీవల ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి గ్రామస్తులు సమస్యను విన్నవించారు. స్పందించిన ఆయన.. సంబంధిత అధికారులతో మాట్లాడారు. డీకే తండాకు ఉదయం ఒక సారి, సాయంత్రం ఒక సారి అనంతపురం నుంచి తిరుమణి వెళ్లే బస్సును గ్రామం మీదుగా వెళ్లేలా అధికారులు నడుపుతున్నారు. గ్రామంలోకి బస్సు వచ్చేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు తండావాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.